

కథా కౌముది

సాక్షి

శ్రీనివాస్ వల్లంభట్ల



కాలానికి సాక్షిగా మారిన కురుక్షేత్రాన్ని రాత్రి తన చీకటి రెప్పల చాటున దాచుకుంది. గాలిలో పొగ వాసన. ఎక్కడ చూసినా విరిగిన రథచక్రాలు, ఛిద్రమైన శరీరాలు. మట్టిలో కలిసిన రక్తం బురదగా మారింది. నిశీధి నీడలు వాస్తవాల్ని దాచాలని విఫలయత్నం చేస్తున్నాయి.

తెల్లవారితే యుద్ధం మళ్లీ మొదలవుతుంది.

గాలికి ఎదురు తిరిగిన ఒక చిన్న దీపం అతని చేతిలో రెపరెపలాడుతోంది. గుట్టలుగా పడివున్న శవాలను బండిలో ఎక్కించుకుని దహనం చేయడం అతని పని, రాజు అప్పగించిన కర్తవ్యం. అతడు అనాథ, ఇంకా ఇరవై ఏళ్లు నిండని పసివాడు.

"రేపటి రక్తపాతానికి ఈ మైదానం సిద్ధం చేయాలి.." అని తనలో తానే గొణుక్కుంటూ ముందుకు నడిచాడు.



రాజులు, యువరాజులు, సారథులు, సైనికులు అన్న తేడా లేకుండా అందరినీ ఎత్తి, ఉయ్యాలలో నిద్రిస్తున్న బిడ్డను తీస్తున్న తల్లిలా బండిలో పడుకోపెడుతున్నాడు. వారి గుండెల్లో దిగిన బాణాలు, బల్లాలను నెమ్మదిగా తీస్తున్నాడు.

అతని అలసట... ఆ బండి మోయలేని బరువు... చక్రాలు నిట్టూర్పు విడిచినట్టు శబ్దం చేస్తున్నాయి.

అప్పుడే అడుగుల చప్పుడు.

అతడు తలెత్తి చూసాడు. దూరంగా తనవైపు వస్తున్న ఆకృతి.

కృష్ణుడు...!!



విన్నాడు కానీ ఎప్పుడూ ఆ మనోహర మూర్తిని చూడలేదు. జుట్టులో నెమలి పింఛం. ఆ ప్రకాశం చీకటిలో కూడా మసకబారలేదు. తుఫాను మధ్య ప్రశాంతతలా ఆయన నడక.

ఒక్క క్షణం తన ఆలోచనలు ఆగిపోయాయి.

"ఇది నిజమేనా...?" అనిపించింది.

దగ్గరకు రాగానే, కాళ్లపై పడి నమస్కరించాడు.

"లేవండి," అన్నాడు కృష్ణుడు మృదువుగా. ఆ స్వరం నేరుగా హృదయాన్ని తాకింది.

అతడు లేచాడు. కళ్ళలో ఆశ్చర్యం. లోపల మనోవేదన.

"స్వామి... ఈ భారం నేను మోయలేకున్నాను. ఇటు చూడండి..."

దగ్గరలో పడి ఉన్న శవాన్ని చూపించాడు.

"ముక్కు పచ్చలారని చిన్నవాడు. ఆ యువకుని చివరి శ్వాస ఇంకా నా చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది. ఈ విపత్తుని మీరు ఆపలేరా?"

కృష్ణుడు సమాధానం చెప్పలేదు. కొద్దిసేపు కనులు మూసుకున్నాడు.

"ఒక ప్రశ్న అడగవచ్చా స్వామి...?"

కృష్ణుడు అడగమన్నట్లు తల ఊపాడు.

"బంధువుల మధ్య విభేదానికి ఇన్ని వేల మంది ఎందుకు చనిపోవాలి? పాలించే రాజు మార్పు కోసం, నా లాంటి వాళ్లు బలి కావాలా ప్రభూ?"

ఒక్క క్షణం ఆగి మళ్ళీ అన్నాడు:

"స్వామి... మీరు కంసుడిని, శిశుపాలుడుని చంపినప్పుడు ఇంతటి రక్తపాతం జరగలేదు, వాళ్ల చేసిన తప్పుకి వాళ్లు చనిపోయారు. అక్కడ న్యాయం జరిగింది. మరి ఇక్కడ...?"

కృష్ణుడు ఆ శవాన్నే చూస్తూ నెమ్మదిగా అన్నాడు.

"నేను సంధి కోసం ప్రయత్నించాను. వినలేదు."

"మీరు అనుకుంటే మరో మార్గం చూపలేరా స్వామి?" అతని స్వరం మరింత దయనీయంగా ధ్వనించింది.

కొద్దిసేపు నిశ్శబ్దం.

"నేను దుష్టులను సంహరించగలను. కానీ మనిషి చేసుకున్న ఎంపికలని కాదు." అన్నాడు కృష్ణుడు ప్రశాంతంగా "కొన్నిసార్లు ఆపడం చేతకాకపోవడం వేరు. ఆపకపోవడం వేరు."

"స్వామి నిజమే... కానీ ఆ రెండింటి మధ్య నిలబడిన వాడికి తేడా కనపడదు కదా."

"ఈ అపరిచితుల మరణం మిమ్మల్ని ఎందుకు కలతపెడుతోంది?" కృష్ణుడు లాలనగా అడిగాడు.

అతడు మాట్లాడలేదు.

కృష్ణుడు నెమ్మదిగా అడిగాడు: "వాళ్లు ఏ పక్షాన పోరాడారు?"

"తెలియదు స్వామి, నేను ఒక శవ వాహకుడిని, నాకు భేదం లేదు."

"మీ పేరు?" అడిగాడు కృష్ణుడు.

అతడు నిర్లిప్తతో చూసి, తల ఊపాడు.

"తెలియదు స్వామి... ఎవరూ అడగలేదు... ఎప్పుడూ."

కృష్ణుడు అనునయిస్తూ చిరునవ్వు నవ్వాడు.

"అయితే మీరు అనుకున్నదానికంటే ఎక్కువే తెలుసుకున్నారు," అన్నాడు. "ఈ రాత్రిని నేను గుర్తుంచుకుంటాను."

అని చెప్పి వెనక్కి ఒక సారి తిరిగి చూసి, తన శిబిరం వైపుకి నడిచాడు.

అప్పటికే పేరులేని అతడు మౌనంగా తన బండిని ముందుకు తోసుకుంటూ చీకట్లో కలిసిపోయాడు.

★★★ ★ ★ ★ ★★★

దూరంగా నగారా మ్రోగుతోంది, మళ్ళీ యుద్ధం మొదలవ్వాలి..

కల చెదిరింది. జవాబు లేని ప్రశ్న మాత్రం అక్కడే మిగిలింది. కృష్ణుడికి మెలకువ వచ్చింది. సత్యం గోచరించింది. కానీ ఆ పేరు లేని యువకుని మొహం మాత్రం మనసులోంచి చెదరలేదు.

"స్వామి... అందరూ మీకోసం ఎదురు చూస్తున్నారు," బయట నుంచి స్వరం.

ఒక్క క్షణం 'ఇది నిజంగా ఆపలేనా?' అనిపించింది.

జవాబు ఆయనకే తెలుసు.

బరువెక్కిన హృదయంతో బయటికి అడుగు వేసాడు.

— ముగింపు —

కురుక్షేత్ర యుద్ధం మొదలవడానికి ముందు రాత్రి, భగవద్గీత చెప్పే ముందు క్షణాల్లో, కృష్ణుడి మనసులో ఏం జరిగింది? ఆ ప్రశ్నకు ఒక కల్పిత సమాధానమే "సాక్షి."

COMMENTS